# 9. మావూరు

చాల ఏళ్ల తరువాత మావూరు వెళ్తున్నాను.

స్కూలు ఫైనలు వరకు మావూళ్లోనే మా తాతగారి దగ్గిర చదువుకున్నాను.

మావూరి మీద నుండి రైళ్లు వెళ్లవు.

రైలు స్టేషనుకు మావూరు పదిమైళ్ల దూరంలో ఉంది. కలిగిన వాళ్లు కార్లమీద పోతారు. సాధారణంగా నూటికి తొంభైమంది బస్సులమీదే వెళ్తారు.

నేను కుటుంబంతో నెల్లూరులో స్థిరపడ్డాను. మామగారు సంపన్నులు. వారింటి పక్కనే నివాసయోగ్యమైన ఇల్లు కట్టించుకొని మే ముంటున్నాము.

నేను మెయిలులో దిగాను. చిన్న సూట్‌కేసు తప్ప నాకు మరేవీ సామానులు లేవు. బస్సులో మావూరు చేరుకున్నాను. బస్సులు ఇప్పుడు ఊరవతల బస్సు స్టేషనులో ఆగుతున్నాయి.

బస్సు దిగుతుంటే నా చిన్నప్పటి సంగతి జ్ఞాపకం వచ్చింది...

అప్పటికి నేను పన్నెండేళ్లవాడిని. మూడవఫారం చదువుతున్నాను. ఆరోజు మా పెద్దత్త భర్త మద్రాసు నుంచి వస్తున్నారు. హై కోర్టులో ఆయన లాయరుగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఆయనకు కొన్ని వందల ఎకరాల పల్లపు భూములు మావూరికి సమీపంలో ఉన్నాయి. మా పెద్దత్తపోయి చాలాకాలమయింది. ఆయన రెండో పెళ్లి చేసుకున్నారు. ఆవిడకూడా పోయింది. మూడవపెళ్లి పెళ్లాం, ఎనభైఏళ్లముసలి తల్లి లంకంత యింట్లో ఉంటున్నారు.

ఆయన మాతాతగారికి టెలిగ్రామ్ చేశారు. తను మెయిలులో వస్తున్నానని ఎవరినైనా బస్సు దగ్గిరికి పంపమని ఆయన నన్ను పంపించారు.

మద్రాసు నుండి వచ్చే మెయిలు సాయంకాలం నాలుగు గంటలకు వచ్చేది. మెయిలు బస్సులకోసం ఆనాటి పోలీసు స్టేషను దగ్గిర నాలుగు గంటల బండి కాపలాకాశాను. మూడు బస్సుల తరువాత నాలుగోబస్సులో ఆయన వచ్చారు. బస్సు టాపు నుండి ఆయన సామాన్లు రెండూను దింపుతుంటే నేను అందుకున్నాఉ. నాకవి బాగా పరిచయమైనవి. మాసిన ఒకతోలు బాగు, ఒక హెూల్డాలు. ఆయన బస్సు దిగి తన సామానుకోసం చూసుకున్నారు. నా దగ్గిర ఆ రెండు చూసి, చాచి నా చెంపమీద కొట్టారు.

"ఎవడ్రా నువ్వు, సామానుదింపు!" ఆయన గర్జించారు.

నా కళ్లంట నీళ్లుతిరిగాయి.

నేను సామాను విడిచిపెట్టలేదు.

"మాతాతగారు, శాస్త్రిగారు, పంపించారు. నేను మీ పెద్దమేనల్లుడిని."

ఆయన కోపం పోయింది. ఇంటి కొచ్చేవరకు ఆయన ఏమీ మాట్లాడలేదు.

అది నాకూ పూరి గురించి, బస్సుదిగుతుంటే వచ్చిన మొదటి జ్ఞాపకం.

ఎవరో బంధువులు ఊళ్లో ఉన్నారు. మా భూములు, ఫలసాయం అనుభవిస్తున్న జ్ఞాతులున్నారు. మా స్థలం కొనుక్కుంటున్న చుట్టానికి మంచి ఇల్లుంది.

కాని నేనెవరి దగ్గిర బసచెయ్యడానికి సమ్మతించలేదు.

నేను మంచి ఉద్యోగం చేశాను. చాల గౌరవంగా బ్రతుకుతున్నాను. ఒక మంచి తరగతి జీవితానికి ఆలవాటు పడ్డాను.

ఆటో పిలిచి పట్టణంలో ఉత్తమమైన హొటలుకు తీసుకుపోమ్మన్నాను.

ఆ విధంగా మావూరికి చాలకాలం తరువాత వచ్చాను.

హొటలులో స్థిమితపడిన తరువాత స్థలం కొనుక్కుంటున్న చుట్టానికి ఫోన్ చేశాను. ఇంతవరకు డెబ్భై చదరపు గజాలకు ధర స్థిరంకాలేదు. పదిసంవత్సరాల కిందిదానికి అయిదువేలు ఇస్తామన్నారు. మరో కొంతకాలం తరువాత పదివేలన్నారు. ప్రయాణానికి మావూరు బయలుదేరుతున్నప్పుడు మా చుట్టం ముప్పై వేలిస్తానని ఫోన్ చేశాడు. అన్నిటికన్న గవరన్నమెంటు ధర తక్కువది. ఆ ధరకు నేను అమ్ముతానన్నాను. దానికి అతను అంగీకరించాడు. ఆరోజు సోమవారం రాత్రయింది. మరునాడు మంగళవారం, బుధవారం నాడు పదిగంటలకు రిజిస్ట్రేషను చేసుకుందామని ఒప్పుకున్నాం.

మంగళవారం స్నానాదులు ముగించుకొని పదిగంటలకు రిజిస్ట్రారు ఆఫీసు చేరుకున్నాను. స్థలం కొనుక్కుంటున్న చుట్టం ఆసరికి అక్కడే ఉన్నాడు. గుడివీధిలో నా జాగాకు చదరపు గజం ఏడువందల పదిహేను రూపాయలు పడుతున్నది. రిజిస్ట్రేషను ఖర్చులు చెరిసగం పెట్టుకోడానికి సమ్మతించారు.

చుట్టం, వాళ్లింటికి భోజనానికి పిలిచాడు. ఎవరో స్నేహితుడు పిలిచాడని తప్పించుకున్నాను. తిన్నగా హొటలుకి వచ్చి, సావకాశంగా నడుంవాల్చి తెచ్చుకున్న పుస్తకం చదవడం మొదలుపెట్టాను.

సాయంకాలం ఎండ చల్లబడిన తరువాత నాతో చదువుకున్న స్నేహితుడి ఇంటికి వెళ్ళాను. అతడిప్పుడు చాలపెద్దలాయరు. ఊరిచివరన పెద్ద రెండంతస్తుల భవనం కట్టించాడు. ఇంటిముందులాను - పెరటిలో మామిడి, సపోటావంటి చెట్లు ఉన్నాయి. అతడుకోర్టు నుంచి వచ్చేసరికి కొంచెం ఆలస్యమయింది. ఇంట్లో రెండు కార్లు, నలుగురు జూనియర్లు, క్యూలో నిలుచున్న క్లయింట్లు, ఈ విధమైన హంగామాతో అతను రాణిస్తున్నాడు. అతనిని చూసి నేనుగుర్తుపట్టినా నన్నతడు గుర్తుపట్టలేదు. నా వివరాలు చెప్పిన తరువాత అతను నన్ను కావలించుకున్నాడు. అన్ని పనులు వెనుకబెట్టి నాతోచాలా సేపు మాట్లాడుతూ కూర్చున్నాడు. రాత్రికి భోజనానికి ఉండపోమన్నాడు. .............

బుధవారం ఉదయం పదిగంటలయేసరికి రిజిస్ట్రారు ఆపీసు చేరుకున్నాను. రాతకోతలు, రిజిస్ట్రేషను మొదలైన పనులు పూర్తయేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. హొటలులో భోజనం చేసి సాయంకాలం అయిదు వరకు విశ్రాంతి తీసుకున్నాను.

నేను వచ్చిన పనిఅయింది. ఇంటికి రాత్రిబండిలో వెళ్లిపోవచ్చు. బహుశా మావూరికి, నాకు సంబంధం ముగిసినట్లే. ఏదో ఈ స్థలం అమ్మేమిషమీద అయినావచ్చాను. ఇక మీద ఆ అవసరంకూడా లేదు.

నాకు ఇంటి దగ్గిర జరూరైన పనులేవిలేవు. రెండు, మూడు రోజులు ఆలస్యమయినా ఇబ్బంది లేదు. ఇంతదూరం వచ్చిన తరువాత మా వూరికి మరోసారి (ఆఖరుసారి) చూసి వెళ్లాలనుకున్నాను. ఇప్పుడక్కదిబ్బలు లేవు. నది ఒడ్డున కొత్తకొత్త ఇళ్లులేచాయి. చక్కటి ఇళ్లు కొన్ని బంగళాలు, కొన్ని మేడలు.

అక్కడ నుండి రాత్రి పడుతుంటే వెనక్కు వచ్చాను. వచ్చేటప్పుడు ఏటిబడ్డున నడిచివచ్చాను. తిన్నగా కోటీశ్వరాలయం రేవు చేరుకున్నాను. పావంచాలుదిగి ఏటిలో కాళ్లు కడుకున్నాను.

మావూరిలో చిన్నతనం గడిపాను. ఒకరోజు కూడా నదిలోస్నానం చెయ్యకుండా ఉండలేదు. అంటే, ఈదకుండా ఉండలేదు. ఈదడం అంటే, నాకొక సంఘటన జ్ఞాపకం వస్తున్నది.

అప్పుడు నాకు పన్నెండేళ్లు. మూడవ ఫారం చదువుతూ ఉండేవాడిని. ఉదయంపూటబడి. బడినుండి రాగానే ఏటికి పరుగెత్తే వాళ్లం. వారధికి దిగువను, గుడిరేవుకు కొంచెం సమీపంలో ఒక పెద్ద బండరాయి ఉంది. అక్కడ పీకమునిగేలోతు రాతి మీద నుండి నీట్లో గెంతే వాళ్లం గుడిరేవు వరకు ఈది అక్కడ మెట్టెక్కే వాళ్లం.

ఆ రోజు స్నానాకి వచ్చేసరికి ఏట్లోకి నీళ్లు వచ్చాయి. బండరాయి చాల వరకు మునిగి పోయింది. నీటి వేగం కూడా హెచ్చింది. నీరు ఎర్రబడింది. ఈత వచ్చినవాడికి లోతు భయం దేనికి. చాల ధైర్యంగా బండరాయిచేరి ఈదుకుంటూ దానిమీద ఎక్కాను. కొద్దిసేపు ఉండి, గెంతి, గుడిరేవు వేపు ఈదడం మొదలు పెట్టాను.

లోతుగురించేనేను ఆలోచించానుకాని, నదీవేగం గురించి ఆలోచించలేదు. నీరు జోరుగా పారుతున్నది. గుడిరేవు సమీపించింది. నేను ఈదుతున్నాను. కాని మెట్లు పది అడుగుల దూరంలో ఉన్నాయి. గుడిరేవు దాటిన తరువాత దిబ్బలరేవు. అక్కడ పెద్దసుడి ఉంది. ఒడ్డుచేరుకోకపోతే సుడిలో మునిగిపోవడం తథ్యం. ఈ ఆలోచన కలిగేసరికి నాకు ధైర్యం సన్నగిల్లింది. మునకలు వేస్తున్నాను. దిబ్బలరేవు వేపు ప్రవాహం తీసుకుపోతున్నది.

నా అవస్థ అప్పుడే స్నానానికి వచ్చి, బట్టలు మార్చుకుంటున్న అమ్మాయి చూసింది. వెంటనే నదిలోకి గెంతింది. నాలుగయిదు అంగలలోనన్ను చేరుకుంది. నేనామెను

పట్టుకోడానికి ప్రయత్నించాను. ఆమె తప్పించుకొని, నన్ను సుడి నుండి దూరానికి తోసుకుంటూ పోయింది. సుడిదాటిపోయిన తరువాత మెరక జాగా కాళ్లకు తగిలింది అక్కడ నుండి ఈదుకుంటూ దిబ్బలరేవుకి దిగువనున్న ఒడ్డుకు తీసుకుపోయింది.

ఆ అమ్మాయికి పధ్నాలుగేళ్లుంటాయి. ఆమె పేరు రమణి. వాళ్లనాన్న పురోహిత్యం చేస్తున్నాడు. ఆనాడు ఆ అమ్మాయి నన్ను తలమీద ఒక మొట్టికాయమొట్టి, అటువంటి సాహసమైన పనులు చెయ్యవద్దని చెప్పి వెళ్లిపోయింది.

ఈ సంఘటన గురించి తలచుకుంటుంటే ఒళ్లు జలదరిస్తుంది.

ఆమెకు పెళ్లయి పోయింది. ఆమె భర్త కూడా పురోహితుడే. గుడికి దగ్గిరలో వాళ్లిల్లు. గుడిలో దేవుడిని చూసుకొని వాళ్లింటికి వెళ్లాను. నన్ను చూసి ఆవిడ పోల్చుకోలేక పోయింది. వివరాలుచెప్పిన తరువాత కేక పెట్టింది.

"ఓరి భడవా, నువ్వట్రా!" కొంచెసేపు ఆలోచించి మళ్లా అంది.

"నువ్వా, మూర్తి? ఎంతమారిపోయావు?"

తరువాత కొంతసేపు మాట్లాడి అక్కడ నుండి వెళ్లిపోయాను.

పిల్లలతోను, మనుమలతోను ఆయిల్లు కలకలలడుతున్నది. ఉపకార బుద్ధిగలవారికి భగవంతుడు ఏలోటూ చేయడు.

సందులలోంచి మెయిన్ రోడ్డువేపు వెళ్తుంటే ఒకయింటి నుండి సంగీతం వినిపిస్తున్నది. ఆ యింటికి పెద్ద అరుగులున్నాయి. వాటిమీద కొంతమంది కూర్చున్నారు. లోపల పెద్దగదిలో ఒకాయన పాడుతున్నారు. ఆయనకు డెబ్బైఏళ్లుంటాయి. కంఠం కొంచెమైన జీరపోలేదు. ఆయన త్యాగరాజ కీర్తన పాడుతున్నారు. సాధారణంగా ఆయన త్యాగరాజు కీర్తనలే పాడుతారు. ఆయన పేరు వాసుదేవశాస్త్రిగారు.

ఆయన యమునా కళ్యాణిరాగంలో

"హరిదాసులు వెడలే ముచ్చటగని.." అన్నీ కీర్తన పాడుతున్నారు. శ్రోతలు పరవశు లై వింటున్నారు. ఒక అరగంట వరకు సభసాగింది. తరువాత మార్దాంగికుడు, వాయులీన విద్వాంసుడు వాద్యాలను తుడిచి దాచుతున్నారు.

ఆయన మహాసంగీత విద్వాంసులు. వారింట చాల మంది శిష్యులుంటారు. ఆయిల్లు ఏమంత పెద్దదికాదు.

తోసుకుని మనుషులు పైకి వస్తున్నారు. చాల సేపయి పాడుతున్నట్లున్నారు. మరునాడు ఉదయం వారిని కలుద్దామని, హొటలుకి వెళ్లిపోయాను.

రాత్రి భోజనయమేసరికి తొమ్మిదిన్నర అయింది. సావకాశంగా పక్కమీద పడుక్కున్నాను. ఫోము పరుపు, ఎయిర్ కండిషనరు ఉన్నా నిద్రరావడంలేదు. ఆరోజు సంగతులు ఒకటో ఒకటి జ్ఞాపకం వస్తున్నాయి. కోటీశ్వరాలయం, రమణి జ్ఞాపకానికి వచ్చాయి.

వాసుదేవ శాస్త్రిగారి గానం జ్ఞాపకానికి వచ్చింది. ఆయన మావూరికి చెందిన మహా విద్వాంసులు. ఈ వయసులో కూడా ఆయనగొంతు మొక్కవోవలేదు. ఆయన చాల గొప్ప పనిచేస్తున్నారు. తనంత పాండిత్యంగల శిష్యులను తయారు చేస్తున్నారు. శిష్యులు ఇరుక్కొని కూర్చొని విద్య నేర్చుకుంటున్నారు.

వారు హాయిగా కూర్చొని పాఠాలు చెప్పడానికి విశాలమైన హాలుంటే బాగుండును. పెరటిలో చాలకాళీ స్థలముంది. చెట్లు, మొక్కలు తీసెస్తే కావలసినంత చోటవుతుంది. తప్పకుండా ఒకహాలు...

స్థలం అమ్మగావచ్చిన ఏభైవేల రూపాయలు అటాచీలో ఉన్నాయి. ఇటీవలే రిటైరయిన తరువాత వచ్చిన పది లక్షల రూపాయలు బాంకులో ఉన్నాయి. చెక్కు పుస్తకం అటాచీలో ఉంది.

మరునాడు ఉదయం వేగంగా లేచాను. స్నానాదులు ముగించుకుని వాసుదేవ శాస్త్రిగారింటికి ఆటోమీద వెళ్లాను. తోవలో పళ్లుకొన్నాను. శాస్త్రిగారు స్నానం, సంధ్య ముగించుకొని శిష్యులకు పాఠాలు చెప్పడానికి కూర్చున్నారు.

నేను వెళ్లి ఆయనకు పాదాభివందనం చేసి అన్నాను:

"శాస్త్రిగారు, నేను ఈవూరివాడినే. మా తాతగారు బ్రహ్మయ్యశాస్త్రిగారు. మా తండ్రి గారు లక్ష్మీనారాయణ గారు. హైస్కూలు తరగతులు ఇక్కడే చదువుకున్నాను. పెద్ద ఉద్యోగమే చేసి ఈ మధ్యే రిటైరయను. నాకు ఈ ఊరిలో మిగిలిన కొద్ది పాటి స్థలం నిన్నను మా చూట్టానికి ఆమ్మివేశాను. సాయంకాలం గుడి నుంచి తిరిగివస్తూ, మీయింటి అరుగుమీద కూర్చొని, మీ శిష్యులకు పాడి వినిపిస్తున్న త్యాగరాజ కీర్తన 'హరిదాసులు వెడలే ముచ్చటగని' అన్న దానిని వింటూ పరవశించిపోయాను. మీరు మహా విద్వాంసులు. మనవూరికే కాదు, రాష్ట్రానికి, దేశానికి మకుటాయమానమైనవారు. మీరు ఈ వీథిగదిలో శిష్యులకు పాఠాలు నేర్పుతున్నారు. మీ పెరడు చాల విశాలమైనది. అక్కడ ఒక పెద్దహాలు కట్టిస్తే ఇబ్బంది లేకుండా పాఠాలు చెప్పడానికి వీలవుతుంది. నేను స్థలం అమ్మగా ఏభైవేలు వచ్చింది. నా బాంకు నుండి ఏభైవేలకు చెక్కువ్రాసి తెచ్చాను. ఈ లక్ష రూపాయలు పెడితే మీకొక చక్కని హాలు తయారవుతుంది. ఇవిగో ధనరూపంలో ఏభైవేలు, ఇదిగో చెక్కు. ఈ రెండూ స్వీకరించి నన్ను అనుగ్రహించండి."

ఆయన నన్ను కూర్చోమన్నారు.

"మూర్తీ, నీ ఔదార్యానికి చాల సంతోషించాను. త్యాగరాజస్వామి ఉంఛవృత్తి మీద జీవితంగడిపారు. నేను వారి అడుగు జాడలలో నడుస్తున్నాను. పళ్లు స్వీకరిస్తున్నాను."

వాసు దేవశాస్త్రిగారు పళ్లు తీసుకొని డబ్బు పళ్లెంలో విడిచి పెట్టారు.